# కాలం జారదు కథ కదలదు

వి. శేషి

గడియారం నోట్లో కాలం చిక్కబడి పోయింది. కాలాన్ని మొయ్యలేక కాస్సేపాగి వెలికిలబడింది గడియారం. దూరంగా చీకటిలో వింతని చూస్తూ రెండు నక్షత్రాలు అవీ ఆగిపోయాయి.

“ఎల్లాగా గడియారం నరాల్లో నెత్తుర పల్లబడిపోయింది. కదలవయ్యా కథ” అంటుంది గాని. దాని కంఠంలో నిర్జీవపు పొంగు. ఆ చూపుల్లో విషం చూపులు. (ఆ కదలికలో బాధల పొక్కులు చేసిన సలుపు.)

గాని కూడా కదలటం లేదు.

గడియారం గోడమీద కూర్చొని ప్రసవ వేదన పడబోయి, ఆగిపోతుంది. కాలాన్ని ప్రసవించితే, కథ కదులును. అది జారదు : ఇది కదలదు.

గోడ గడియారంపైకి చీకటిమూగి వేడిపుట్టించే యత్నాలు చేస్తుంది. అయినా కాలం ఊడి రాలిపడుతుందనే ఆశలేదు.

ఈ కాలంపైకి చీకటిమూగి లెక్కలేనన్ని సంవత్సరాలు గతించిపోయాయి. అయినా కాలం గుర్తించదు. చీకటి పేరుకుపోయి బెరడు కడుతుంది. కథ కదలదు.

బల్లమీద తెల్లకాగితాలపై (ఆరోజుల్లో అయితే తామ్రశాసనాలూ, శిలాశాసనాలూను) పరుగెట్ట వలసిన కథ అలానే ఆగిపోయి, గోడగడియారం ముఖంలోకి ఆశాదృక్కులు సారిస్తుంది. అదికాస్తా కదిలితే కథ కంచికో, సంచకో దారితీసును.

గడియారం చుట్టూ దుమ్ము చేరింది. అది రాలుతున్నప్పుడెల్లా గడియారం మూలుగుతుంది. వ్యాధి ముదురుతుందో, దుర్ముఖం పుట్టిందో కూడా కథకి అర్థం కావటంలేదు.

(కథ సంపలు 'మరిగింది.' కంచెలు పరచిపోకపోవటానికి గుచ్చుకున్న ముళ్ల బాధ తప్పితే మరో కారణం లేదు. కాబట్టి కథ కంచికెలాగూ తిరిగి వెళ్ళలేదు.) కథ భవిష్యత్కార్యక్రమం ఆలోచించబోయి, అలానే ఆగిపోయింది.

యోచించవలసింది మాత్రమేముంది కథకి? కథ తానెక్కడ ఆగిపోయానో కూడా మరచిపోయింది. అంతకాలానంతరం పూర్వస్మృతులు యదలో బుసలు కొట్టి అలిసిపోయి, ఆవులిస్తున్నాయి.

అవును. కథకి బాగా జ్ఞాపకం వస్తున్నాయి.

పరమాణుశక్తిని, పరమాణువులు కూడగట్టుకున్న తరవాత, భూమి నిట్టూర్పుల్లో వేడి చల్లారినప్పుడు కథ పుట్టింది. ఎమీబాగా అవతరించి, న్యూక్లియస్‌లో జీవం పొదిగి, రాత్రిందివాల పరిణామం సాగించింది. ఆనందంతో ఉప్పొంగి అంగాలు చాచింది.

తరువాత కథ ముళ్ళదారుల్లో నడిచింది. కొండరాళ్ళలో పాకింది. చీకటి కోణాలలో నిద్రించింది. ఆ గాయాలింకా సలుపుతున్నాయి. ఆ సలుపు ద్వారానైనా ముందుకు కదలాలంటే, కాలం కదలదు !

[కథ తెల్లబోయి తెల్లకాగితంమీద, గోడమీద గండుపిల్లిలాగ కూర్చుని చూస్తుంది గడియారం ముఖకవళికల్లోకి.

గడియారానికేదో చెప్పాలనుకుంది. చెప్పాలి. కాని, చెప్పవలసింది మరిచిపోయేటంత బాధలో చిక్కుకుంది కథ. జీవన్మరణసమస్యతో సతమతమైపోతున్న కథ.]

నడిచిన దారులన్నీ చీకటిదారులే. రాళ్లూ, రప్పలూను. గుంటలూ, పెంటలూ దారికడ్డంగా. గుచ్చుకుని అరకాలులో ఒత్తుకుపోవడానికి సిద్ధంగా ముళ్లు. అంధకారం గుప్పిట్లో అజ్ఞానిలాగ కథ ఖైదు చెయ్యబడింది. ఆకలి లయగా అరిచింది. బాధతో నినదించింది. అగ్నిలాగ జ్వలించబోయి చీకట్లో చల్లబడిపోయింది.

"నన్నిలాగ బంధించినవారెవరు ?"

తనలోనే ప్రశ్న.

"చీకటి ఆకలి!"

ప్రశ్న చుట్టూ సమాధానం.

చీకటి గుప్పిట్లో చిద్రుపలైపోతున్న జీవశక్తిని కూడగట్టుకుని, చేతులు విరుచుకోబోయింది కథ. చేతులు కదల లేదు. నోరుకూడా...చేతులనిండా అరదండాలు; చుట్టూ అంధకారం...

కథకే కన్నుకనబడింది కాదు.

పరోక్షకి కెలాగ కనబడుతుంది కథ?

కథ నడవాలని చూచింది. అన్నీ నల్లరాళ్ళు. అంతేనా! కాళ్ళు కదలటం లేదు. పాపం! కాళ్లకి కూడా సంకెళ్లు. పాతరాతిపైన తన అచేతన స్థితికి కుందింది. కుందటం చేతగాక కుందింది. ఆ పరిస్థితిలోనే అలమటించింది కథ. ఆకలేసి చీకటి మేసింది. అజ్ఞానంతో ఇల్లు కట్టి, అందులో కాపరం పెట్టింది.

కథకు జీవితం నచ్చలేదు. ఎందుకు నచ్చలేదో దానికి అర్థం కాలేదు. చీకటిని ప్రశ్నించబోయి, చీకటికే సమాధానం చెప్పి, ప్రశ్న సమాధానంగా గ్రహించి, కథ పాతరాతిమీద తన పాదం మోపింది.

చుట్టూ కొండలు అల్లుకున్న పాదులాగ చెల్లాచెదురై ప్రవహిస్తున్న నదులు, అడవులు. దెయ్యాల్లాగ తలలు విరబోసుకున్న చెట్లు, జంతువులతో కథ కదలబోయి, కదలాననుకుని సంతృప్తి పడింది. కథనిండా తృప్తి నల్లమందులాగ ఆవహించింది.

కథ వెనక తరుముకుంటూ సూర్యుడూ, సూర్యుడిని తరుముకుంటూ కథా పరుగెత్తారు. కాలం ప్రవహించింది. గాలి ప్రవహించింది. కథ క్లయిమాక్సుకు వెళ్ళనంత సంబరపడింది. కథాంతం విషాదాంతమో, సుఖాంతమో తెలిసింది కాదు. 'స్కిట్' అయినా కావచ్చు. ఏదైతేనేం. కథకి పరోక్ష ఆలోచన లేదు. అది గోళాల పరిభ్రమణంలో పోటీపడి పరుగెట్టింది.

సూర్యుని వేడినీ, వేగాన్నీ చూచి ఆశ్చర్యపడింది కథ. గాలి తీవ్రత చూచి భయపడింది.

ఎంత వేగం
ఎంత తీవ్ర స్వరూపం
ఎంత తేజం!

ఆ తరవాత కథకూడా కదలాలని కదలలేకపోయింది. ఆపేక్ష్యం వెన్నమీద పొడుస్తుంది. ఆవేశం హృదయాన్ని దహిస్తుంది. ఆలోచన మెదడులో జ్వలిస్తుంది. ఆపేక్ష్యం బాహువులమధ్య పల్లవిస్తుంది. ఆశ అలసత్వాన్ని చీలుస్తుంది.

అంతవేగంగా పరుగెట్టాలి.

అంతే. అలాగ ప్రకాశించాలి.

అలాగ...అలాగ...అంతే సరిగా అలాగ.

ఎల్లాగో కథకి అర్థం కాలేదు. అయినా ఆలోచన చేస్తూ చూచింది.

కొండల్ని దోచి, బండల్ని నలచి శక్తుల్ని మరింత దగ్గరికి తెచ్చుకొని పరీక్షించింది. ప్రశ్నించబోయి, పరవశంలో కొండలకీ బండలకీ మొక్కి, బండబారిపోయింది కథ.

ఎన్నో బాగా గడిపిన రాత్రులూ, జంతువులో జంతువుగా జాగారం చేసిన రాత్రులవంటి ఉదయాలూ స్మృతికి తెచ్చుకుంది. అందని కాంతికంటే అందిన అంధత్వం మేలని సంతృప్తిగా నిట్టూర్చింది. సంతృప్తి కథలో క్లోరోఫారం కోరింది. కథ కదలలేక బండరాయిగా గుళ్ళపైనా గోపురాలపైనా అవతరించి ఆగిపోయింది.

ఆ రోజులే అసహ్యమనిపించాయి కథకి. స్త్రీని తరిమి, చుట్టూతిరిగి, జుట్టుపట్టుకొని చుట్టూ చెట్లలోపడి నదుల ప్రక్కతూరి, ముళ్ళలో వాలిపోయినా సరే - ఆ స్త్రీతో అక్కడ - ఎంతో ఘోరం అనిపించింది. కథకి వేమీ నచ్చటంలే దిప్పుడు. అప్పుడు నవ్వుకున్నా, ఆ నవ్వు బాధ కలిగిస్తుం దిప్పుడు.

గుడి మధ్యగాతిలో నగిషీల మధ్య నాణ్యంగా వెలిసి ఆగిపోయింది కథ.

ఆ రాళ్ళలోనే నిలబడి చేతులు విరుచుకోబోయింది. ఇంకా శృంఖలాబద్ధమై వున్నాయి. కదలటంలేదు.

ప్రక్కనేదో మెదిలింది.

"ఎవరు నువ్వు"

కథ ప్రశ్నించింది.

"నే నెవరినైతే నీకేం?"

"అదికాదులే, నిన్ను చూస్తుంటే కదులుతున్నట్లుంది నాకు. ఇక్కడున్నావేం?"

"నా కవనసదనం."

"చెప్పకూడదా?"

కథ ప్రాధేయపడింది.

"బందీకి! ప్రాధేయపడే లక్షణం...!"

చిన్న నవ్వు. నవ్వులో వేదన. ప్రాణాలు పిండే వేదన.

"బందీని కాదు. బంధనాలు త్రెంచుకోవటానికే ప్రయత్నం. అందుకే బాధ. అందుకే ఆవేదన."

"నిజంగా!"

"ఊఁ!"

"నీకు నా ధన్యవాదాలున్నీ!"

అంతవరకూ ముడుచుకున్న కథ ముఖంలో నవ్వులు నాట్యంచేశాయి.

"నువ్వు బంధనాలు ఛేదించుకో. అప్పుడే నాకు స్వేచ్ఛ. అబ్బ! ఈ చీకటి మధ్య మిణుకు మిణుకుమంటూ — ఏం సుఖం. కాని ......... నువ్వు నన్ను ప్రేమించలేవూ?"

"అంటే!" ఆశ్చర్యంగా అడిగింది కథ.

"ఏముంది. ఆ రాళ్ళని ప్రేమించానని భ్రాంతిపడుతున్నావ్. వాటిలో ఏదో వుందనుకుంటున్నావు. అయినా కొంత మేలే జరిగింది. ఆత్మ కొక శిక్షణ. నువ్వు నన్ను ప్రేమించు నేస్తం."

"అంటే!" కథ కింకా అర్థం కాలేదు. అదేదో కొత్త భాష వింటున్నట్టు అయ్యింది కథకి.

"నువ్వు నన్ను ప్రేమించు. అంటే - మనసిచ్చి పుచ్చుకోవటం ప్రేమ. మనసు

నిలపటం ప్రేమ. ప్రేమ పవిత్రం. పవిత్రత ప్రేమ. స్వర్గద్వారానికి తాళం చెవి ప్రేమ."

ఆ శక్తి దూరంగా నిలబడలేక పోయింది. కథయొక్క ఆలోచనల సాలీ గూడు మధ్య శలభంలాగ చిక్కుపడి, సాలిపురుగు లాగ మారిపోయింది. ఆ అల్లికలలో వింత కాంతులు. వింత వింత నగిషీలు.

కథకంతా కొత్తగా కనబడింది. దాని హృదయాంతరాళంలో కొత్త జల్లు. నూతన భావాల మొలకలు.

చక చకా నడిచింది కథ.

పకపకా నవ్వింది కథ

నూతన భావాలతో పరిమళించింది కథ.

"ప్రభూ అన్ని దిక్కుల నుండి ఉత్తమ ఆశయాలు నాదగ్గిరికి చేరేటట్టు చెయ్యి" అని వేడుకుంది కథ.

మరొక రోజున —

"సత్య దృష్టి !"

సత్య సందర్శనం !!

"సత్య సంస్కృతి !!!"

అని రాగం తీసింది కథ.

మూడవ రోజున —

"నీ పొరుగు వాడిని నీవలె ప్రేమించు"

అని నినదించి, పంచకోశ ప్రాణాలు పీకి గుప్పిట్లో పెట్టి అమరత్వం పొందింది.

కథ "ఎంత మార్పు" అని నిట్టూర్చి, "నథింగ్ యీస్ ఫైనల్" అని గొణుక్కుంది.

కథాగమనం మనోవేగంతో పోటీ పడి సాగింది. వెనక్కి తిరిగితే కనబడక కరిగిపోయే కాలంలాగ సాగింది కథ.

"మరో ప్రపంచం, మరో ప్రపంచం" అని కేకలేసింది.

రెక్కలు కట్టుకుని ఆకాశంలోకి ఎగిరింది;

దిక్కుల్ని చూచి ఫక్కున నవ్వింది.

చుక్కల్లోకి పరుగెట్టింది.

ఒక్కసారి జలాంతర ప్రదేశాలు సందర్శించింది.

ఒక్క కాలంలో భూనభోంతరాళాల్లో కథ.

ఒక్క త్రుటిలో సర్వాంతర్యామి అయిన కథ.

చెక్కిన బొమ్మకు రక్తజీర అంటుకున్నట్టు చక్కగా, సర్వాంగ సుందరంగా కథ.

నూతనగీతంలో ప్రాణశక్తి అయినకథ.

ఈథర్‌లో కథ. రేడియోలో, టెలివిజన్‌లో; టెలిపతిలో కథ.

స్పుత్నిక్‌లో కూర్చుని ఖండాంతర వాసం చేసి, గ్రహాలతో నేస్తం చేసి వచ్చిన కథ.

అణువులో పరమాణువును విడదీసి, విడదీసి, అద్భుతశక్తిని కలుసుకున్న కథ.

అంతగొప్ప కథ హఠాత్తుగా ఆగిపోయి, తెల్లకాగితంమీద కూర్చుని, గోళ్ళు గిల్లుకుంటూ గోడ గడియారంపై చూస్తుంది.

గడియారం ముఖంపైని మృత్యుధూళి రాలుతుంది. దాని విషహస్తంతో నిమురుతుంది కంఠం. కాలం కదలటంలేదు. గంటక్రితం ప్రేలిన అణుబాంబు జిమ్మిన మృత్యుధూళి. కథ వళ్లంతా కాలిపోయింది. కడుపులో పేగులు నులిపెడు

తున్నాయి. కాళ్ళు తెగిపోయాయి కథకి. కదలలేక కూర్చుంది కథ.

తెల్లకాగితం అందుకొని ముక్కుతూ, మూలుగుతూ రాసింది తీవ్రవేదనతో.

"వెంటనే అణ్వస్త్రాలు నిషేధించాలి"

కాని, అదెవరు ప్రవేశపెట్టాలో, ఎలాగో కథకి అర్థంకాక, అక్కడితో ఆగిపోయి తెల్లకాగితంమీద తెల్లబోయి కూర్చుని, గడియారంలో కాలాన్ని చూస్తుంది...

కాలచక్రం కాళ్ళకి అణు— బంధనాలు బిగించింది గడియారం. గుండెల్లో బాధ. కథాగగనంలో అడ్డంకులు, చెడ్డదారులు.

ఆగిపోయిన కథకి అంతకాలం ఊతకర్రఅయి అరిగిపోయింది.

"కాలచక్రం కాళ్ళకి గుండుసూది కాదయ్యా; గండుమేకు గుచ్చుకొంది. సెప్టిక్ కూడా అయ్యింది. కదలదయ్యా కథ" అని గీపెడుతున్నాయి కథని చూస్తున్న రెండు నక్షత్రాలూను.

పువ్వొత్తుల్లా కాంతినిచిమ్మే నక్షత్రాలు రెండూ నల్లగా మారిపోయి, కొవ్వొత్తులకోసం వెదకబోయి, అవి కూడా ఆగిపోయాయి.

కాలం జారదు —

కథ కదలదు.

ఎలాగ ?

(ప్రపంచ పరిణామం: కథ; రెండు నక్షత్రాలు: సూర్య చంద్రులు)

